మినీ కథా వీధి



# తుపాకీలు

నండూరి సత్యసుబ్రహ్మణ్యం

అప్పలస్వామిగారు హేట్ తీసి చేత్తో పట్టుకుని కుర్చీలో కూర్చున్నారు కోదండరావుగారు ఓ భావగీతం అందుకున్నారు. వారిద్దరి హృదయాల్లో కృష్ణశాస్త్రి మెదలుతున్నాడు. అంతలో లోపల్నుంచి పిల్లలిద్దరు పరుగెత్తుకుంటూ వచ్చేరు. వాళ్ళు కోదండరావుగారి మనవలు. ఒకడికి ఎనిమిదేళ్ళుంటాయి. ఇంకోడికి ఆరేళ్లు. పిల్లలు తాతగారి దగ్గరకి చేరేరు. "తాతగారండీ ! మాకు తుపాకులు కావాలి" అన్నాడు పెద్ద మనవడు. తాతగారు సమాధానమివ్వలేదు కళ్ళు మూసుకుని భావాంబర వీథుల్లో విహరిస్తున్నారు.

"తుపాకీలు బజార్లో ఎక్కడా లేవయ్యా !" అప్పలస్వామి మాష్టారు చెప్పేరు. "ఉన్నాయి. మాకు తెల్సును" పిల్లల జవాబు. "తుపాకీలు నేవు బాబూ" నీళ్ళకావడితో వస్తూ నౌకరు నూకాలు చెప్పేడు "నీకు తెలియదు పో" పిల్లలు వాణ్ణి కసిరేరు. పనిమనిషి రాములమ్మ లోపల్నుంచి "నిజం బాబులూ ! తుపాకీలు ఏ కొట్టుకాడా నేవు" అని చెప్పింది. "తుపాకీలు యెక్కడా లేవర్రా. అయినా మీకెందుకు ?" తాతగారు అప్పటికి తేరుకుని చెప్పేరు. "వీళ్ళకేమి తెలియదులాగుంది" అన్నట్టు పిల్లలు మొగం పెట్టేరు. "తుపాకీలు బజార్లో యెక్కడా లేవయ్యా ! నేను బజారునుంచే వస్తున్నాను" అప్పలస్వామిగారు పిల్లల్ని సమాధానపరిచేరు. "మీకేం తెలియదు పొండి. మీరు పిల్లలు" చిన్న మనవడు ఠక్కున జవాబిచ్చేడు. అప్పలస్వామిగారు ఆ మాటకి నవ్వేరు. కోదండరావుగారు శ్రుతి కలిపేరు.

వీధిలో సైకిలు స్టాండువేసి మణ్యం లోపలి కొచ్చేడు. చిన్నవాడు పరుగెత్తి కొచ్చి సైకిలు పెడలు మీద కాలువేసి తొక్కుతున్నాడు. "అయితే మేం వచ్చేటపుడు పట్టుకొస్తాంలే" వాళ్ళ నెలాగో సమాధానపరచాలని అప్పలస్వామి మాష్టారు అన్నారు. పెద్దవాడు అదోలా చూశాడు. "అవి ఎక్కడుంటాయో మీకేం తెల్సు. మేం తెచ్చుకుంటాం. మీరుండండి" పెద్దవాడి సమాధానం. "ఇంతకీ తుపాకీతో ఏం చేస్తావోయ్ !" అప్పలస్వామిగారు పెద్ద మనవడ్ని అడిగేరు. "మిమ్మల్ని పేల్చేస్తా."

పిల్లల్ని తీసుకుని వాళ్ళు బజారుకు బయలుదేరేరు. పిల్లలు తిన్నగా వెళ్ళి ఓ కొట్టుదగ్గర ఆగేరు. కొట్లో తుపాకులు తళతళ మెరుస్తున్నాయి పిల్లల ముఖాల్లో కోటి మతాబాల వెలుగు. తాతగారు పిల్లలకి తుపాకీలు కొనిపెట్టేరు. పిల్లలు ఎగిరి గంతేశారు. దీపావళి అప్పుడే వాళ్ళదగ్గరికి వచ్చేసింది

పిల్లలు నడుస్తున్నారు- పెద్దవాడు అప్పలస్వామిగారి చెయ్యి పట్టుకున్నాడు. చిన్నవాడు తాతగారిచెయ్యి పట్టుకున్నాడు. రోడ్డు మీంచి లారీ వస్తోంది. పిల్లలు వాళ్ళని పక్కకి లాక్కెళ్ళారు. అప్పలస్వామిగారు చిన్నపిలాడిలా పెద్దాడి వెనకాలే వెళ్ళేరు. లారీ క్షణంలో పక్కనుంచి దూసుకుపోయింది. "మీరు పిల్లలు మీకేం తెలియదు" పెదవాడిమాటలు లారీశబ్దంలో కలిసిపోయేయి "అవును మేం పిల్లలమే" అంటూ అప్పలస్వామిగారు 'పెద్దాడి' చెయ్యి పట్టుకుని నడిచేరు.


## ఆకర్షణ

విలేకరి : సినిమా రంగంలో ఇంత ఎత్తుకు ఎదిగాక ఇంకా మీరు కోరుకుంటున్నదేమిటి ?

సినీతార : ఇలాగే నా అందం, నటన ప్రేక్షకుల్ని, నిర్మాతల్ని ఆకట్టుకుంటూ, ఇన్ కంటాక్సువారిని మాత్రం ఆకట్టుకోకుండా, ఆకర్షించకుండా వుండాలని.

—బి. జగన్నాథరావు, బొంబాయి


ఆంధ్రజ్యోతి
సచిత్ర వార పత్రిక
లోకాన్ని ద్వేషిస్తే
లోకం ఎంత మంచిదో
తెలుసుకోవడం ఎలా ?
లోకం
ఎంత మంచిది!
[నవలిక]
డాక్టర్
చల్లా రాధాకృష్ణశర్మ
వచ్చే వారంనుంచి

ఇటీవల ముఖ్యమంత్రి నివాస గృహంలో ప్రొఫెసర్ బి. వి. పట్టాభిరాం మాజిక్ ప్రదర్శన జరిగినప్పుడు ఆయనను అభినందిస్తున్న శ్రీ టి. అంజయ్య. సాంస్కృతిక వ్యవహారాల మంత్రి శ్రీ భాట్టం శ్రీరామమూర్తి